పింగళి సూరన

# కళాపూర్ణోదయం



# కళాపూర్ణోదయం

వచన రచన :

రెంటాల గోపాలకృష్ణ

జయంతి పబ్లికేషన్స్
కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 520 002.

# KALAA POORNODAYAM

By :
**RENTALA GOPALA KRISHNA**

**JAYANTHI PUBLICATIONS**
KARL MARX ROAD
VIJAYAWADA - 520 002.
Ph : **0866 - 2577828**
Mobile : **8978261496**

ó **PUBLISHER**

Edition :
**2013**

Cover Design :
**A. GIRIDHAR**

PRICE **:** **₹ 40-00**

D T P :
**SRI SRINIVASA GRAPHICS**
VIJAYAWADA - 521 108.
Ph : 9440397989

Printers :
**NAGENDRA ENTERPRISES**
VIJAYAWADA - 3.

కలభాషిణి (కథానాయిక, ఈమే తరువాత మధురలాలస)

మణికంధరుడు (కథానాయకుడు, ఇతనే తరువాత కళాపూర్ణుడు)

నారదుడు

రంభ

నలకూబరుడు

కృష్ణుడు

జాంబవతి

మణిస్తంభుడు

దేవలోకపు చిలుక

ఇంద్రుడు

మృగేంద్ర వాహన

మాయారంభ (కలభాషిణి)

మాయా నలకూబరుడు (మణికంధరుడు)

సుగాత్రి (సుముఖాసత్తి)

శాలీనుడు (మణిస్తంభుడు)

అలఘుప్రతుడు

మణికంధర హారం

బ్రహ్మ

సరస్వతి

స్వభావసిద్ధుడు (సుగాత్రి తండ్రి)

సత్త్వదాత్ముడు (కళాపూర్ణుని మంత్రి)

# కళాపూర్ణోదయం

## ఆశ్వాసం - ఒకటి

### కలభాషిణి

**అ**ది ద్వాపరయుగం. శ్రీకృష్ణపరమాత్మ ద్వారకా నగరాన్ని పరిపాలిస్తున్న సమయం. ఆ పట్టణ వైభవం వర్ణనాతీతం. అది నాకపురిని గేలి చేస్తున్నది. సమస్థ సిరిసంపదలకూ, భోగభాగ్యాలకూ, కళలకూ ఆకరమై శ్రీహరికి కేళీ భవనంగా ఉన్న ద్వారక నిజంగా భూలోక స్వర్గం. ఆకాశం అంటుతున్న బంగారు మేడలు, శత్రుకోటి గుండెలు ఝల్లుమనిపిస్తున్న కోటలు, గజాశ్వభట కోటలతో నిండిన పేటలు, సుందర నందనోద్యాన వనాలు, తామర కొలనులు, చెప్పనలవి కాని అంద చందాలతో ఒప్పుతున్న ద్వారక బృందారకా బృంద సంసేవ్యమై, పుణ్యప్రదమైన సప్తపురాలలో ఒకటిగా ప్రసిద్ధికెక్కింది. శ్రీకృష్ణుడు పదహారు వేలమంది గోపికలతోను, రుక్మిణి, సత్యభామ, జాంబవతి, మిత్రవింద ఆదిగా గల అష్ట భార్యలతోను

కూడినవాడై వైకుంఠంలో కూడా లేని సుఖాలు అక్కడ అనుభవిస్తున్నాడు. ద్వాపరయుగంలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసే నిమిత్తం అవతరించిన ఆ శ్రీహరిని దేవతలు, మహర్షులు నిత్యం సందర్శించి, సేవించి కృతార్థులవుతున్నారు.

ద్వారకా నగరంలో కలభాషిణి అనే ఒక వారకాంత ఉన్నది. ఆమె చాలా చక్కనిది. రంభకు సాటివచ్చే సౌందర్యవతి. కులానికి వేశ్య అయినా గుణ సంపత్తిలో కులకాంతలకన్న మిన్న. అంతేకాదు. ఆమె విద్యలన్నీ నేర్చింది. ఆటలో, పాటలో అప్సరసలను మించింది. అన్ని కళలూ ఆమెకు కరతలామలకములు. ఎంతో చమత్కారంగా, నేర్పుగా మాట్లాడడంలో ఆమెకు ఆమే సాటి. తెలివి, చాకచక్యం, ధైర్యం, సాహసం – మున్నగు గుణాలన్నీ ఆమెలో ఉన్నాయి. ఇంత ఎందుకూ ? కలభాషిణిని చూస్తే ఏ దేవకాంతయో శాపవశాన ఈ భూమిమీద పుట్టిందా అనిపిస్తుంది. మెరుపుతీగె లాంటి మేను, చంద్రబింబం లాంటి ముఖం, తామరపత్రాల వంటి పెద్ద పెద్ద కళ్ళు, తళుక్కుమనే చంచలమైన చూపులు, వెన్నెల విరిసినట్లుండే నవ్వు, ఒత్తుగా తుమ్మెదలు బారు కట్టినట్టున్న శిరోజాలు, నిక్కపొడుచుకున్న గుబ్బ చన్నులు, పిడికిటిలోకి చాలని సన్నని నడుము, బలిసిన పిరుదులు, నిండు యౌవనంతో తొణికిసలాడుతున్న విలాసిని ఆ కలభాషిణి. ద్వారకా పట్టణంలోని విటుల చిత్తాలను దోచుకుంటూ వచ్చింది. రసికుడైన ప్రతివాడికి ఆమె మీదనే కన్ను. అయితే ఆమె ఎవరికీ వశం కాలేదు. అందరికీ ఆ సుందరి వడ్డించిన విందుగా ఉంటుంది.

"ఔరా! ఏమి దీని చక్కదనం! ఈ జవ్వని ఎవ్వని సొత్తు కానున్నదో కదా? అటువంటి పుణ్యం చేసుకున్న వాడెవడో కదా ?" అని పురుషులు ఎవరికి వారు తమలో తాము తలపోస్తూ, ఉవ్విళ్ళూరుతూ ఉన్నారు.

ఇలా ఉండగా ఒకనాడు కలభాషిణి చక్కగా అలంకారం చేసుకుని, తన చెలికత్తెలతో కలిసి ఉద్యానవనంలో విహరించడానికై వెళ్ళింది. వసంత శోభతో వెల్లివిరిస్తూ అత్యంత మనోహరంగా ఉన్న దా ఉద్యానవనం. కలభాషిణి, ఆమె చెలికత్తెలు ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటూ, ఒకరి నొకరు పరాచకాలాడుకుంటూ వన విహారం చేశారు. పరిమళాలు వెదజల్లే పూలపొదలు, లతలు తిలకిస్తూ వాటి అందచందాలను వర్ణించారు.

"ఈ పూలగుత్తులు నీ గుబ్బ చన్నులవలె నున్నవే!" అన్నది ఒక చిన్నారి మరొక చెలితో.

"ఈ పున్నాగ కొమ్మలు చూడవే. ప్రియుడు దగ్గరికి చేర్చుకున్నట్లు నిన్ను పయిటపట్టి లాగుతున్నవి!" అని ఎకసక్కెమాడింది ఒక భామ మరొక కోమలితో.

"అదిగో! ఆ పూలచెట్టు ముందరి కొమ్మలు గాలికి నిన్ను రమ్మని పిలుస్తున్నవే – పారిపోతావేం?" అన్నది ఒక నీలవేణి, వేరొక కీరవాణితో.

ఇలా వారంతా నవ్వుతూ, పేలుతూ, ఆటలతో, పాటలతో కొంతసేపు హాయిగా గడిపారు. వెన్నెల పండుగగా ఉన్న రకరకాల పూలు కోసుకొని కొప్పులో పెట్టుకున్నారు. తరువాత వారంతా ఉయ్యాలలూగడం ప్రారంభించారు.

అప్పుడు ఆకాశ మార్గాన నారద మునీంద్రుడు వీణ వాయించు కుంటూ పోతున్నాడు. ఆయన శ్రీకృష్ణపరమాత్మను సందర్శించ డానికై ద్వారకా నగరానికే వస్తున్నాడు. నారదుడి వెంట మణికంధరుడనే శిష్యుడు కూడా ఉన్నాడు. అతను ఒక గంధర్వ కుమారుడు. వారు ఇలా గగన మార్గాన ద్వారకకు వస్తూ ఉద్యానవనంలో ఉయ్యాల లూగుతున్న యువతీమణులను

చూచారు. వారి ప్రగల్భతా గరిమ మణికంధరుడికి ఎక్కడలేని ఆశ్చర్యం కలిగించింది. అప్పుడతను తన గురువైన నారదమహర్షితో ఇలా అన్నాడు:

"మునీంద్రా! సుందరోద్యానవనంలో పూలతీగెల తూగుటుయ్యాల లూగుతున్న ఆ యువతులను చూశారా? ఒకరితో ఒకరు పంతాలాడుకుంటూ ఉయ్యాల లూగుతున్నారు. ఆహా... ఏమి వారి చక్కదనం! ఆ గుబ్బి గుబ్బల వయసుకత్తెల కుసుమకోమల పాదాలు చూచారా మహర్షీ? వారు కాళ్ళు పైకి చాచి ఉయ్యాల లూగుతూ ఉంటే, మింటివైపు సాగుతున్న వారి పాదాల ఠీవి చూడండి. అందంలో పందేనికి రమ్మనమని రంభ, ఊర్వశి ఆదిగాగల అప్సర కాంతలను వారు పిలుస్తూ కయ్యానికే కాలు దువ్వుతున్నట్లున్నది."

మణికంధరుడి మాట విని నారదుడు "అరెరె! నీవు సత్కవివి. నీవు చెప్పింది నిజం సుమా! నీవు చెప్పిన ఆ ఎలప్రాయపు మిటారికత్తెల అందం నే నెక్కడా చూడలేదంటే నమ్ము. టుంగు టుయ్యాల లూగుతూ ఉండే వారి పాదాలు అలా అలా పైకి పోవడం అప్సరాంగనల తలదన్నే టట్లున్నవని నీవు చక్కగా వర్ణించావు మణికంధరా. నీవన్నది చాలా సముచితంగా ఉన్నది. ఇందులో దోషం లేదు, నిజం చెప్పావు" అని ప్రశంసించాడు.

## రంభ

అయితే అప్పుడొక చిత్రం జరిగింది. దేవ వేశ్యలలో ప్రధానురాలైన రంభ, ఆమె ప్రియుడు నలకూబరుడు అదే సమయంలో ఒక దివ్య విమానం ఎక్కి మబ్బుల చాటుగుండా ఆ ప్రక్కనుంచే వెళుతూ ఉండడం తటస్థించింది.

నారదుని మాటలు రంభ విన్నది. అందచందాలలో తనకు సాటి వచ్చే స్త్రీ మూడు లోకాలలోనూ లేదని రంభకు గర్వం. అలాంటిది ఇప్పుడు సామాన్య మానవ యువతులను మహా సౌందర్యవంతులుగా నారదుడు వర్ణించి, ప్రశంసించడం ఆమెకు గిట్టలేదు. ఎక్కడలేని అసూయా పుట్టుకొచ్చిందామెకు. మనసు చివుక్కుమన్నది. 'అమ్మా! ఈ నారదుడే ఇట్లా మాట్లాడుతున్నాడే' – అని కోపం కూడా తెచ్చుకున్నది. అయితే తన మాత్సర్యాన్ని, ఆగ్రహాన్ని బయటికి కనిపించనీయకుండా లోలోపల అనచుకున్నది. నలకూబరుడితో మామూలు ధోరణిలోనే "విన్నావా ప్రియా ఆ మాటలు? కలహభోజనుడైన నారదుడే అట్లా మాట్లాడుతున్నది. సరే – మనం ఒకమాటు ఆ మహర్షిని దర్శించి సముచిత రీతిని గౌరవించి వెళ్ళడం మంచిదనుకుంటాను" అన్నది.

"సరే, అలాగే చేద్దాం" అన్నాడు నలకూబరుడు.

తరువాత వారు తమ విమానాన్ని నారదుని మాటలు వినిపించిన దిక్కుగా పోనిచ్చారు. ఇంతలో రంభ, నలకూబరుల సంభాషణ నారదమునికి కూడా కాస్త చెవిన పడింది.

'ఎవరో మాట్లాడుకుంటూ ఇటువైపు వస్తున్నట్లున్నదే?' అని అనుకున్నాడు.

కాసేపట్లో రంభ, నలకూబరుల విమానం ఉదయాద్రి చాటు నుండి బయటికి వచ్చిన బాలారుణ భానుబింబంలా మబ్బుల్లను చీల్చుకుంటూ ఇవతలికి వచ్చింది. వారు తమ విమానాన్ని నారదమునీంద్రుని పాదాల క్రిందికి పోనిచ్చి ఆయనను సమీపించారు. అలా పోనిచ్చి పారిజాత సుమ సౌరభాలు వెదజల్లుతున్న తమ శిరస్సులను ఆ మహర్షి పాద పద్మములపై ఉంచి ప్రణామం చేశారు. మాటి మూటికీ ఆ ముని పాదాలు కళ్ళకు

అద్దుకున్నారు. అప్పుడు నారదుడు వారి భక్తికి సంతుష్టుడై "మీ రిద్దరూ ఒకరిపై ఒకరు వదలని ప్రేమతో కలకాలం వర్ధిల్లండి!" అని దీవించాడు.

అప్పుడు రంభ నారదుని చూచి చిరునవ్వు నవ్వుతూ 'మునివర్యా! మీ ఆశీర్వచన ప్రభావం వల్ల మా ఇద్దరి ప్రేమ చెదరకుండా కొంతకాలం నిలిస్తే నిలుస్తుందేమో ? కాని, ఒక్క విషయం – ఇకమీదట నరధామినుల సోయగానికి ఈ నలకూబరుడు భ్రమసిపోకుండా ఉంటాడా? – అని నా సందేహం" అన్నది.

రంభ ఎలా అమిత చక్కనిదో అలాగే నలకూబరుడు కూడా చాలా చక్కనివాడు. ద్వారకాపురీ ఉద్యానవనంలో ఉయ్యాలలూగుతున్న మానవ కాంతల సౌందర్యాన్ని నారదుడు ప్రశంసించడాన్ని మనసులో పెట్టుకుని రంభ, అది సహించలేక ఆయనతో ఇట్లా ఎత్తిపొడుపుగా మాట్లాడింది. అయితే, నారదమహర్షి సౌందర్య గర్వితురాలైన రంభ మాటలలోని అంతరార్థం ఇట్టే గ్రహించాడు. ఆమెకు తగిన బుద్ధి చెప్పాలనుకున్నాడు.

"ఏమిటి రంభా? ఏదో వ్యంగ్యంగా మాట్లాడుతున్నావే? ఏమిటి సంగతి ? అదేదో కాస్త విశదంగా చెప్పు వింటాను" అన్నాడు.

"సరే, చెబుతాను, ఇలా విమానంలోకి దయచేయండి, వివరంగా మాట్లాడుకుంటూ పోదాం. మహానుభావులైన మీ సేవాభాగ్యం కొంత దూరమైనా మాకు లభిస్తుంది. మేము తరిస్తాం – రండి" అని రంభ నారదుణ్ణి ఆహ్వానించి ఆయననూ, ఆయన శిష్యుడైన మణికంధుణ్ణీ తమ విమానంలో ఎక్కించుకున్నది. రంభ, నలకూబరుడు చెరొక వింజామర తీసుకుని, మహర్షికి ఇరువైపులా అటొకరు, ఇటొకరు నిలుచుని మెల్ల మెల్లగా విసరడం మొదలు పెట్టారు. అలా వింజామర వీస్తూ రంభ, నారద మహర్షితో సంభాషణకు దిగింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1818**

* * *